క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



పెదకూరపాడు: ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించే సీఎం రిలీఫ్ ఫండ్ అందరికి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన పైడాల శ్రీనివాసరావుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.20 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే వారు, వైద్యానికి ఖర్చు పెట్టే స్తోమత లేనివారు సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధిని ఆశ్రయించవచ్చన్నారు. పేదలకు సాయం చేసేందుకు సీఎంఆర్ఎఫ్ ఉందని , ఎన్నో జీవితాలను నిలబెట్టిందన్నారు. కార్యక్రమంలో కంభంపాడు గ్రామ సర్పంచ్ ఆర్తిమళ్ల నాగేశ్వరరావు ఉన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు 11 మంది విద్యార్థుల ఎంపిక

క్రోసూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 11 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మండలంలోని హసనాబాద్ గ్రామంలోని జెడ్పీపాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు గడ్డం వెంకట్రామయ్య, షేక్‌జుబేదా, మాతంగి సౌజన్య, షేక్ ఆస్మ, మర్రి నరసింహాస్వామి , కాశింసెట్టి వెంకటసుధ, కాశింసెట్టి లక్ష్మీ తిరుపతమ్మలు ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.విజయకుమారి తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా మండలంలోని బయ్యవరం గ్రామం జెడ్పీపాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు కొమ్మామణికంఠ, పయ్యావుల రోషిణిగాయత్రి, శిరసానిలక్ష్మీ తిరుపతమ్మ, తిరుమల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం ఏ.అప్పారావు తెలిపారు.

పేదలకు అన్నసంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో వాసవి మాత అన్న ప్రసాద వితరణ పథకం కింద 204ఏ శ్రీనివాస డైమండ్ క్లబ్ సెక్రటరీ వనమా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 31 మంది నిరుపేదలకు శనివారం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా సమన్వయకర్త బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, కొలిశెట్టి కోటేశ్వరరావు, లక్ష్మన్, సుబ్బారావు, సభ్యులు ఉన్నారు.

వైభవంగా భూసమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరుని కల్యాణం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని శ్రీభూసమేత శ్రీకల్యాణవెంకటేశ్వరుని కల్యాణమహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సూర్యప్రకాశనంద శ్రీకామాక్షిదేవి యోగీశ్వరశ్రీసరస్వతీ స్వామి చేతుల మీదుగా కల్యాణవెంకటేశ్వర స్వామికి శాంతికల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం విశ్వక్సేన పూజ, మండపారాధన, పంచామృతస్నపన విశేష పూజలు నిర్వహించారు. విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అచ్చంపేట ఏఓగా వెంకటేశ్వర్లు



అచ్చంపేట: అచ్చంపేట మండల వ్యవసాయాధికారిగా పొత్తూరి వెంకటేశ్వర్లు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏఓగా ఉన్న షేక్ సుగుణా బేగం బదిలీపై నూజెళ్ల మండలం వెళ్లారు. ఈ సందర్భంగా ఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

కార్మికుల పిల్లలు బాలకార్మికులు కాకూడదు

సత్తెనపల్లి: డాక్టర్ పిల్లలు డాక్టర్ అయినా పర్వాలేదు, యాక్టర్ పిల్లలు యాక్టర్ అయినా పర్వాలేదు కానీ కార్మికుల పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోనూ కార్మికులు కాకూడదని, మరి ముఖ్యంగా బాల కార్మికులు అసలే కాకుడదని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి. నాగ వెంకటలక్ష్మి సూచనలమేరకు పట్టణంలోని 16 వార్డులో గల 15 వ సచివాలయము పరిధి లోనీ చెంచు కాలనీలో బాల కార్మిక వ్యవస్థ రహిత సమాజం కోసం జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఉన్న తల్లిదండ్రులకు, పిల్లల విద్యకు సంబంధించి ఉన్న అనేక చట్టాలను న్యాయవాదులు, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి లు తెలియజేశారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

ఆర్డీఓ రాజకుమారి



సత్తెనపల్లిలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజకుమారి

పెదకూరపాడు: రీ సర్వే పనులు వేగవంతం చేయాలని సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి అన్నారు. శనివారం మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆమె తహసీల్దార్ క్షమారాణితో కలిసి పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఉదయం 6 గంటలకు ప్రారంభించి 10 గంటలకు సర్వే పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీలో రోడ్లు . విద్యుత్, నీటి సౌకార్యల కల్పించినా ఎందుకు ఒక ఇల్లు కూడా నిర్మాణం చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు. మొదటి విడతగా ఎస్సీ కాలనిలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. వీఆర్‌ఓ ప్రసాద్, సర్వేయర్ గోగులపాటి కోమలి. గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

రీసర్వే సమర్థవంతంగా చేపట్టాలి

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల, చేజర్ల, రూపెనగుంట్ల గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా చేపట్టనున్న సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వేపై వీఆర్వోలు, సర్వే సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నర్శింగపాడు, త్రిపురాపురం, చీమలమర్రి గ్రామాల్లో వ్యవసాయభూముల రీసర్వే పూర్తయి హద్దురాళ్లు ఏర్పాటు పూర్తయిందన్నారు. రీ సర్వే చేపట్టాల్సిన గ్రామాల్లో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు బృందాలుగా ఏర్పడి సీసీఎల్ నిబంధనల ప్రకారం గ్రామాల్లోకి ప్రజలకు ముందుగా నోటీసులు అందజేయాలన్నారు. సర్వేలో తప్పులతడకలు లేకుండా ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని హద్దులు నిర్ణయించాలన్నారు. గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడి భవిష్యత్తులో భూసమస్యలు రాకుండా సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ చంద్రబాబు, ఇన్‌చార్జి ఆర్ఐ సీహెచ్.పురుషోత్తం ఆయాగ్రామాల రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



రీసర్వేపై రెవెన్యూ, సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న నకరికల్లు తహసీల్దార్ సురేష్

బాలిక విద్యను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

పెదకూరపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం బాలిక విద్యను ప్రోత్సహిస్తున్నారని 75త్యాళ్ళూరు జూనియర్ కాలేజ్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి అన్నారు. 75 త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలకు , హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అందుకు అనుగుణంగా ఇంటర్మీడియెట్ విద్యాను బోధించేందుకు బోధకులను నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలుగు బోధించేందుకు టి.దత్తేశ్వరరావు, ఇంగ్లీషుకు కే. మేరి రత్నహెబ్బినా, లెక్కలకు కెవి.రమణమూర్తి, ఫిజిక్స్‌కు బాజీఖాన ఎకనామిక్స్‌కు ఏసుబాబు, సివిక్స్‌కు కె. అజిత, నిమయించినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేరేంట్స్ కమిటీ, బోధకులు ఇంటింటి క్యాంపెన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శాంత భూక్ష్మీ మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో చేరిన వారికి ప్రతి ఏడాది రూ. 5వేల స్కాలర్ షిప్‌ను దాతల సహాయంతో అందిస్తామన్నారు. ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.



ఇంటింటి క్యాంపెన్ చేస్తున్న ఉపాధ్యాయులు, పేరేంట్స్ కమిటీ సభ్యులు

జగనన్నే మా కుటుంబానికి అండ



కొమరాబత్తిన కిరణ్ కుటుంబం



జగనన్న నిర్మించిన ఇంటిలో కిరణ్

పెదకూరపాడు: నా పేరు కొమరాబత్తిన కిరణ్... మా అమ్మ పేరు నాగమ్మ....మాది పెదకూరపాడు గ్రామం ఎస్సీ కాలని....మా అమ్మకు కళ్లు లేవు..... నా చిన్నతనంలోనే మా నాన్న చనిపోయ్యాడు.... నాకు ఊహ రాకుండానే మా అన్నయ్య మృతివాత పడ్డాడు. కళ్లు లేని అమ్మ నన్ను పోషించి పెద్దవాడిని చేసింది. నాకు వయస్సు వచ్చినాక కుటుంబపోషణ కోసం చదువు మానేసి సిటీకెబుల్‌లో పని చేస్తూ జీవనం సాగించేవాడిని వృత్తిలో ఉన్నప్పుడు కరెంట్ షాక్ తగిలి నా రెండు చేతులు పోయాయి. దీంతో మా కుటుంబ పోషణ క్లిష్టతరంగా మారింది. మాకు ఇల్లు కూడా లేదు అద్దె ఇంట్లో ఉంటూ జీవనం గడుపుతున్నాము. నా పరిస్థితి చూసి జాలి పడిన వారే తప్ప నా కుటుంబాని ఆదుకునే వారే లేరు. నా భార్య కూలీ పనులకు వెళ్లి నన్ను, నా తల్లిని పోషించేది. ఆమె రెక్కాడితే కాని మాకు అన్నం లేదు. ఇంత కష్టాలో ఉన్న మా కుటుంబానికి జగనన్న ప్రభుత్వం ఆదుకుంది. నాకు , మా అమ్మకు జగనన్న నెలకు రూ.6 వేలు పింఛన్ ఇస్తున్నారు. ఈ క్రమంలో అద్దెలు కట్టుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నాము. నాకు ఇద్దరు పిల్లలు. పిల్లలు చదువులకు డబ్బులేని పరిస్థితిలో జగనన్న ప్రభుత్వం అమ్మ ఒడి పథకం తెచ్చి ఆదుకుంది. దీంతో పిల్లల చదువులకు ఇబ్బంది లేదు. ఇల్లు లేక ఇబ్బందులు పడుతుంటే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మా ఇంటికి మా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వచ్చారు. మా పరిస్థితి చూసి వెంటనే ఇల్లు మంజూరు చేశారు. దీంతో మాకు ఉన్న రెండు సెంట్లలో ఇల్లు కట్టుకున్నాము. బిల్లులు కూడా వచ్చాయి. జగనన్న ప్రభుత్వం రాకపోతే మా పరిస్థితి ఊహించుకోలేము. థ్యాంక్యూ జగనన్న.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



అచ్చంపేట: చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి వృత్తి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అచ్చంపేట ఎస్ఐ కె.పాల్‌రవీంద్ర శుక్రవారం విలేకరులకు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని ఓర్వకల్లు గంగమ్మతల్లి దేవాలయం వద్ద గతనెల 21వ తేదీన ఒక వ్యక్తి బాగా మద్యం సేవించి సొమ్ముసిల్లి పడిపోయి ఉండగా గ్రామస్తులు 108వాహనానికి సమాచారం అందించడంతో వారు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఈనెల 22వ తేదీన మృతి చెందాడు. మృతునికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, 5.7 అడగుల ఎత్తు, చామనచాయ రంగు కలిగి ఉంటాడని ఎస్ఐ తెలిపారు. తెలుపురంగు చొక్కా, కాఫీరంగు లోయర్ డ్రాయర్ ధరించి ఉన్నాడున్నారు. అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు : 9440796234, 08640246033 నంబర్లకు పోనుచేసి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

తప్పిన పెను ప్రమాదం

సత్తెనపల్లి: పెను ప్రమాదం తప్పిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయ ప్రహరీ గోడను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. చీరాల నుంచి హైదరాబాదు వెళ్తున్న బస్సు సత్తెనపల్లి చేరుకోగానే లారీని తప్పించే క్రమంలో బస్సు డ్రైవర్ గోడను ఢీకొట్టాడు. ప్రమాద సమయంలో బస్సులో 49 మంది ప్రయాణికులు ఉన్నారు. అత్యవసర ద్వారం ద్వారా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికి ఎలాంటి ప్రాణహాని లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రోడ్డు పక్కన శీతల పానీయాలు విక్రయించు కునే వారి ఫ్రిజ్ పూర్తిగా ధ్వంసం అయ్యింది. బస్సు ముందు భాగం ధ్వంసం అయ్యింది.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ



మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజుపాలెం: మలేరియా నిర్మూలనతో ఆరోగ్య సమాజాన్ని నిర్మించ వచ్చని డాక్టర్ వెంకటకృష్ణకుమార్ తెలిపారు. మండలంలోని పెదనెమలిపురిలో మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా మలేరియాపై గ్రామంలో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట కృష్ణకుమార్ మాట్లాడుతూ వచ్చే నెల నుంచి వర్షాకాలం వల్ల దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. దోమలు నిల్వ ఉండడం వల్ల మలేరియా, డెంగీ, బోధకాలు చికెన్‌గున్యా, పిల్లలకు మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తంగా ఉండాలని తెలిపారు. ర్యాలీ గ్రామ పుర వీధుల్లో నిర్వహిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, కమ్యునిటీ హెల్త్ అధికారి లక్ష్మీదుర్గ, తేజస్విని, ఏఎన్ఎంలు నాగమణి, మేరీ, రాజు సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

పెదకూరపాడు: చల్లంగా చూడమ్మా గంగమ్మ తల్లి అని భక్తులు అమ్మావారిని వేడుకున్నారు.... పాడి పంటలతో మా గ్రామం సుభిక్షంగా ఉండేలా కాపాడమ్మా అంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బలుసుపాడు గ్రామంలో కోలవైన గంగమ్మ తల్లి జాతర శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గంగమ్మ తల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కలు చెల్లించిన వారిలో క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణశివాజి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మస్తాన్ షరీఫ్, జిల్లా పార్టీ నాయకులు , నూతలపాటి వెంకట శివ, బచ్చు హనుమంతురావు, ఎంపీటీసీ ఉమామహేశ్వరరావు, నల్ల మేకల సురేంద్ర తదితరులు ఉన్నారు.

బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి



భట్లూరులో అవగాహన కల్పిస్తున్న మల్లెల చిన్నప్ప

సత్తెనపల్లి: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో శనివారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పిల్లలను జీరో నుంచి ఐదు సంవత్సరాల లోపల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలోల్ చేర్పించాలన్నారు. ఐదు సంవత్సరాల పైబడిన వారిని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఐదో తరగతి పూర్తి చేసి 6వ తరగతిలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు విద్య ద్వారా మాత్రమే అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్య కానుక, అమ్మబడి, వసతి దీవెన, విదేశీ విద్యను పొందాలంటే ప్రధానంగా మన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రుల చేతుల మీదుగా బిస్కెట్స్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మదమంచి రమాదేవి, మండదపు మేరీ, ఆయాలు సుస్మిత, వరలక్ష్మి , తదితరులు ఉన్నారు.

తాలూకా సెంటర్లో అగ్నిప్రమాదం

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్లో అన్నా కాంటీన్ ఎదుట రోడ్డు పక్కన ప్లాస్టిక్ బొమ్మలు, మహిళలకు సంబంధించిన వస్తువులు, తదితరాలు విక్రయించే దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నిప్రమాదం జరిగింది. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన సాధు ధనలక్ష్మి గత నాలుగేళ్లుగా మహిళలకు అవసరమైన వివిధ రకాల వస్తువులు, చిన్న పిల్లలకు సంబంధించిన బొమ్మలు, తదితర వాటిని అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. కాగా ఇక్కడే ఉంటున్న నక్కలవాళ్ళకి చెందిన నాగరాజు అనే యువకుడు గత కొంత కాలంగా ఆమెను ఖాళీ చేయిస్తానంటూ అప్పుడప్పుడు బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ఆ బెదిపింపులను ఆమె ఖాతరు చేయకుండా తన పని తాను చేసుకుంటూ వెళుతుంది. సరుకు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసుకొని ఇంటి వద్ద నిల్వ చేసి దుకాణానికి వచ్చేటప్పుడు అవసరమైన కొంత మేరకు తీసుకు వస్తుంది. ఇటీవల ఆమెకు చెయ్యి విరగడంతో కొనుగోలు చేసిన సరుకు మొత్తం దుకాణంలోనే నిల్వ చేస్తుంది. శుక్రవారం దుకాణం మూసివేసే సమయంలో ఒ బొమ్మ ఆమె విక్రయించగా తనకు బేరం రాకుండా పోయిందంటూ ఆమె పట్ల ఉరిమి చూసినప్పటికీ ఆమె పట్టించు కోకుండా వెళ్ళింది. ఇది గమనించిన దుండగుడు శుక్రవారం అర్ధరాత్రి నిప్పు పెట్టడం తో దుకాణం మొత్తం దగ్ధమైంది. స్థానికంగా ఉన్న నక్కల వాళ్ళు చూసి డ్రైనేజీ కాలువ నీటితో కొంతవరకు మంటలను అదుపు చేశారు. లేకుంటే వరుసగా మరి కొని దుకాణాలు దగ్గమయ్యేవి. దుకాణంలో సుమారు రూ. 70 వేలు విలువచేసే సరుకు అగ్నికి ఆహుతి అయినట్లు ధనలక్ష్మి విలపించింది. రెక్కాడితే గాని డొక్కాడని ఆమె పరిస్థితి చూసి పలువురు కంట తడిపెట్టారు. ఖచ్చితంగా నక్కల వాళ్ళకి చెందిన నాగరాజు ఈ ఘటనకు పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా పోలీసులు విచారిస్తున్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ పనులు పరిశీలన

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులను ఆ పథకం ఏపీడీ వెంకటనారాయణ శనివారం పరిశీలించారు. జిల్లా డ్వామా పీడీ ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న 20 ఎస్టీ కుటుంబాల వారి వద్దకు వెళ్లి పనికి హాజరు కావాలని కోరారు. పథకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వీరందరికీ పని కల్పించేందుకు అవసరమైన పనుల ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సోమవారం నుంచి పనులకు హాజరవుతామని కాలనీవాసులతో ఒప్పించారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో పనులు జరిగే ప్రాంతాన్ని పరిశీలించి వారి మస్టర్ రికార్డులను తనిఖీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పర్యావరణ వినాశకారి పాలిథిన్



పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో పాలిథిన్ పై అవగాహన కల్పిస్తున్న కళాజాత

సత్తెనపల్లి: పర్యావరణానికి అత్యంత హాని కలిగించే వినాశకారి పాలిథిన్ పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధ ఆజ్ఞలు అమలు చేస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ స్టూడెంట్ అవేర్నెస్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని లక్కరాజు గార్లపాడు బస్ స్టాప్ సెంటర్, గడియార స్తంభం సెంటర్‌లో శనివారం కళాకారులు కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలిథిన్ వినియోగాన్ని నిషేధిస్తూ ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో వచ్చేసరికి నీరు గారి పోతున్నాయన్నారు. పాలిథిన్ కవర్ల వినియోగం పెరుగుతుందని, ప్రభుత్వాల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు హడావుడి తప్ప ప్రజల్లో మార్పు రాకపోవడంతో పాలిథిన్ వినియోగం షరా మామూలే అవుతుందన్నారు. పాలిథిన్ కవర్లో ఉంచిన వేడి పదార్థాలను తీసుకోవడం ద్వారా విషవాయువులు శరీరంలోకి చేరుతాయని, ఫలితంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. పాలిథిన్ గ్లాసుల్లో వేడి పానీయాలు సైతం ప్రమాదకరమని, మనం వాడి పడేసిన పాలిథిన్ వ్యర్థాలను తిన్న ఆవులు, గేదెలు, మృత్యువాత పడుతుండడం చూస్తూనే ఉన్నామన్నారు. పాలిథిన్ పూర్తిగా వదిలేస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలమన్నారు. ప్రభుత్వ ఆదేశాల అమల్లో ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరుతూ కళాజాత ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారుల బృందం, తదితరులు ఉన్నారు.

సైక్లింగ్‌తో బహుళ ప్రయోజనాలు

డాక్టర్ రాజేష్



సైక్లింగ్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్

అచ్చంపేట: గతంలో ఇంటికోక సైకిల్ ఉండడం వల్ల ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేవారని, కాని ఇప్పుడు ఇంటికి రెండు మోటారు వాహనాలు రావడంతో కొద్దిదూరంకూడా నడవలేక బైక్‌పై వెళుతునాన్నారని అందువల్లనే 20 సంవత్సరాలకే మోకాళ్లు నొప్పులు వస్తున్నాయని మండలవైద్యాధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైకిల్ తొక్కడం వల్ల బీపీ, సుగర్ తగ్గుతాయని, శ్వాశకోసవ్యాధులు దరిచేరవని, కాళ్లలో పటుత్వము పెరుగుతుందని చెప్పారు. ఇంటికికొక్కటైనా సైకిల్ కొనుక్కోని రోజుకు కనీసం ఒక కిలోమీటరు దూరమైన ప్రయాణిస్తే వ్యాధులబారినుండి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్యామల, డాక్టర్ రాజేష్, సీహెచ్‌ఓ శివనాగేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ కె.పార్వతి, పిహెచ్ఎన్ మేరి జాన్స్, హెచ్‌వి ఎలిజబిత్, ఎంపిహెచ్ఎస్ రాధాకృష్ణ, భాగవదాసు, ల్యాబ్‌టెక్నీషియన్ సుభాని, స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంలు, ఆశవర్కర్స్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలి



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిమ్మకాయల రాజనారాయణ

సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించ వచ్చునని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమకాయల రాజనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణానికి చెందిన దాత పిక్కిలి రత్తయ్య కుమార్తె పిక్కిలి అలేఖ్య పుష్పాలంకరణ సందర్భంగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన పేద మహిళలకు వడ్డవల్లి ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజనారాయణ మాట్లాడుతూ నిరుపేద మహిళలకు అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ అమ్మ లాంటిదని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల నిరుపేద మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్, సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు పిక్కిలి రత్తయ్య, గుంటూరు గోవిందు, పిక్కిలిశివ, రాజేష్,కంటూ.వెంకట్రామయ్య, చామర్తి వెంకటటేశ్వర్లు(చిన్నా), మోదుగుల బాబ్జి కుమార్, పిల్లకతుపుల నాగేశ్వరరావు, గొట్టం వెంకటేష్ ,తేటనీళ్ల అప్పయ్య పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వసతి గృహంలో ఇండోర్ రేసిడ్యూయల్ స్ప్రేయింగ్ చయిస్తున్న మలేరియా సిబ్బంది

సత్తెనపల్లి: కీటక జనిత వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్ బి.రోశయ్య అన్నారు. పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ ఆదేశాల మేరకు పట్టణ మలేరియా సబ్ యూనిట్ పరిధిలోని సత్తెనపల్లి పట్టణం, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ బాల, బాలికల వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలు, వసతి గృహాలల్లో దోమల నియంత్రణ ముందస్తు చర్యల్లో భాగంగా మలాథీయన్ పౌడర్‌తో ఇండోర్ రెసిడ్యూయల్ స్ప్రేయింగ్ చేయించారు.